క్లుప్తంగా

ప్రభుత్వ భూమిని కాపాడాలని అదనపు కలెక్టర్‌కు వినతి

హుజూరాబాద్‌రూరల్‌: మున్సిపల్‌ పరిధిలోని ఎస్సారెస్పీ ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సోమవారం అదనపు కలెక్టర్‌ ప్రఫుల్‌ దేశాయ్‌కి యువజన కాంగ్రెస్‌ నాయకుడు టేకుల శ్రావణ్‌ వినతిపత్రం అందజేశారు. పట్టణ నడిబొడ్డున సైదాపూర్‌ రోడ్డులోని ఎస్సారెస్పీ ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఎస్సారెస్పీ డివిజన్‌ (1) పరిధిలోని ఎడమ,కుడి కాలువకు ఇరువైపులా భూములు కబ్జా చేసి యథేచ్ఛగా మున్సిపల్‌ కార్యాలయం నుంచి అనుమతి లేకుండా నిర్మిస్తున్నారని, మున్సిపల్‌ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదన్నారు. హుజూరాబాద్‌ ఆర్డీవోకు ఫిర్యాదు చేశామని అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకొని ప్రజాప్రయోజనాలకు వినియోగించాలన్నారు. ఈ విషయమంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్‌ హామీ ఇచ్చారని తెలిపారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశం సోమవారం తెలిపారు. సీసీఐ సంస్థ, రాష్ట్ర కాటన్‌ జిన్నింగ్‌ మిల్లర్స్‌ అసోసియేషన్‌ నిబంధనలపై మిల్లర్లు కొనుగోళ్లు నిలిపివేతకు పిలుపు నిచ్చిన విషయం తెలిసిందే. సీసీఐ, రాష్ట్ర కాటన్‌ జిన్నింగ్‌ మిల్లర్లతో ప్రభుత్వం కొనుగోళ్ల విషయంపై నిర్వహించిన సమావేశం సఫలమైందని మార్కెట్‌ యార్డులో యథావిధిగా కొనుగోళ్లు సాగుతాయని ఖరీదు, అడ్తివ్యాపారులు, గుమస్తాలు, హమాలీ, దాడువాయి, రైతులు సహకరించాలని కార్యదర్శి పేర్కొన్నారు.

దేశిని చిన్నమల్లయ్యకు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు, అభిమానులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో సోమవారం దివంగత ఎమ్మెల్యే దేశిని చిన్నమల్లయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ప్రజాకూడలిలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ సతీమణి పొన్నం మంజుల పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, మహిళా విభాగం జిల్లా నాయకురాలు ఓరుగంటి భారతీదేవి, జిల్లా నాయకులు దాసరి ప్రవీణ్‌కుమార్‌, మాచమల్ల రమణయ్య, మాజీ ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం, మాజీ సర్పంచ్‌ శ్రీమూర్తి రమేశ్‌, యువజన కాంగ్రెస్‌ నాయకుడు మిట్టపెల్లి ఆదర్శ్‌, గౌడ సంఘం మండలశాఖ అధ్యక్షుడు బొమ్మగాని వెంకటేశం, దేశిని చిన్న మల్లయ్య కుటుంబ సభ్యులు, కులబాంధవులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రమంత్రి తీరు సరికాదు'



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్‌, నాయకులు

శంకరపట్నం: బోనస్‌పై కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ విమర్శలు సరికాదని మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌ గౌడ్‌ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కస్టం మిల్లింగ్‌లో డిఫాల్టర్లుగా ఉన్నవారి నుంచి బియ్యం సేకరించే విషయంలో జాప్యంతో తూకం ఆలస్యంగా ప్రారంభమైందని, మండలంలో 26వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు కేంద్రాల్లో కాంటా వేశారని తెలిపారు. కేంద్రమంత్రి హోదాలో రైతులకు భరోసా కల్పించకుండా రైతులను అయోమయానికి గురిచేసే విధంగా మాట్లాడటాన్ని ఖండించారు. గతేడాది హైదరాబాద్‌లో వరదల్లో వాహనాలు కోల్పోయిన వారికి వాహనాలు ఇస్తామని చెప్పి ఎంతమందికి ఇచ్చారో ప్రశ్నించారు. జాతీయ రహదారి నిర్మాణం ఎందుకు కాలేదో సమాధానం చెప్పాలన్నారు. సన్న వడ్లకు ప్రభుత్వం బోనస్‌ చెల్లిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు బస్వయ్య, నాయకులు మల్లారెడ్డి, తిరుపతి,రాజిరెడ్డి, వెంకటేశం, సదానందం, వెంకటేశ్వర్‌రావు,రాజకొంరయ్య, మధు, నర్సింహారెడ్డి,కిష్టయ్య తదితరులు ఉన్నారు.

ఆమె కళ్లు సజీవం

జమ్మికుంట: పట్టణానికి చెందిన వివాహిత రాసమల్ల రోజా(31) ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందింది. సదాశయ ఫౌండేషన్‌ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. రోజా నేత్రాల సేకరణకు కుటుంబ సభ్యులకు అంగీకారం తెలపగా వరంగల్‌ ఎల్‌వీపీ టెక్నీషియన్‌ లక్ష్మణ్‌ సహకారంతో కళ్లను సేకరించి హైదరాబాద్‌ ఎల్‌వీపీఐ బ్యాంక్‌కు తరలించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శివానందయ్య, జగదీశ్వర్‌, రవీందర్‌, సదాశయ ఫౌండేషన్‌ జాతీయ కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి బీష్మాచారి, సలహాదారులు రమేష్‌, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో భవిష్యత్‌ నాశనం



వెన్నెంపల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్‌ సీఐ టి. శ్రీనివాసులు



సాక్షి స్పందన

సైదాపూర్‌: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, మత్తుపదార్థాలకు బానిసైతే బంగారు భవిష్యత్‌ నాశనం అవుతుందని హుజూరాబాద్‌ ప్రోహిబిషన్‌, ఎక్సైజ్‌శాఖ సీఐ టీ. శ్రీనివాస్‌ అన్నారు. అక్టోబర్‌ 17న 'సాక్షి'లో 'మత్తు వదలరా' కథనం ప్రచురితమైంది. ఈ సందర్భంగా పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈమేరకు అధికారులు విస్తృతంగా అవేర్నెస్‌ కార్యక్రమాలు చేపడతున్నారు. సోమవారం మండలంలోని వెన్నెంపల్లి ఉన్నత, సోమారం ఆదర్శ పాఠశాలలో హుజూ రాబాద్‌ సీఐ శ్రీనివాస్‌ మత్తుపదార్థాలు–అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లలు చదువుకొని ప్రయోజకులు కావాలని తల్లిదండ్రుల ఆశలను ఆవిరి చేయొద్దని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ సంపత్‌కుమార్‌, హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌ఐ వినోద్‌కుమార్‌, హెచ్‌సీ ముకుందరెడ్డి, సిబ్బంది సంతోష్‌, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో ప్రేరణ కీలకం

- కీడల్లో గురుకులాల ఖ్యాతి చాటాలి
- జోనల్‌ స్థాయి స్పోర్ట్స్‌ మీట్‌ ప్రారంభంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్‌: నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే దిశగా విద్యార్థులు ప్రయత్నాలను నిరంతరంగా కొనసాగించాలని, లక్ష్య సాధనలో ప్రేరణే కీలకమని మానకొండూర్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని దేవంపల్లి గురుకుల ఆశ్రమ పాఠశాలలో 10వ జోనల్‌ స్థాయి స్పోర్ట్స్‌ మీట్‌ను సోమవారం ప్రారంభించారు. ముందుగా జాతీయ పతాకం ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు జీవితంలో ఎదగాలంటే చదువులోనే కాకుండా ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించాలని సూచించారు. వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు తమ ప్రతిభను వెలికి తీయాలన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, గురుకుల పాఠశాలల్లో క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. క్రీడల నిర్వహణకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలను 20 జోన్లుగా విభజించి బాలబాలికలకు వేర్వేరుగా క్రీడాపోటీలు నిర్వహిస్తుందన్నారు. జోన్‌ లెవల్‌ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారని, చదువులోనే కాకుండా క్రీడల్లో రాణిస్తూ గురుకులాల ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు. ఇటీవల నేషనల్‌ లెవల్‌లో అండర్‌–14 యోగాలో గోల్డ్‌మెడల్‌ సాధించిన మాస్టర్‌ దీపక్‌ను అభినందించారు. పేరెంట్స్‌ కమిటీ చైర్మన్‌ రేణికుంట బాబు, మొగురం రమేశ్‌, దాసారపు ప్రవీణ్‌ తదితరులు ఎమ్మెల్యేకు పూలె బోకెతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీఎస్‌డబ్ల్యూ ఆర్‌టీఐ సొసైటీ, జాయింట్‌ సెక్రటరీ ఆర్‌.అనంతలక్ష్మీ, దేవంపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ గోలి జగన్నాథం, తహసీల్దార్‌ రాజేశ్వరీ, మండల విద్యాధికారి మధుసూదనాచారి, పీఈటీలు, హెల్త్‌ సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులు

హుజూరాబాద్‌రూరల్‌: ఆల్‌ ఇండియా అంబేడ్కర్‌ యువజన సంఘం రాష్ట్రశాఖ ఆదేశానుసారం సోమవారం మున్సిపల్‌ పరిధిలోని ఇప్పలనర్సింగపూర్‌ నూతన కార్యవర్గ సమావేశం స్థానిక అంబేడ్కర్‌ భవనంలో ఎన్నికలు నిర్వహించారు. కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్గనైజింగ్‌ కార్యదర్శి వంతడుపుల బాబు హాజరయ్యారు. అలాగే స్థానిక కౌన్సిలర్‌ బారగాల శివకుమార్‌ పర్యవేక్షణలో వరంగల్‌ జిల్లా ఏఐఎస్‌ బాధ్యుడు చదరం సారంగం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోరగాల రాజ్‌కుమార్‌, కార్యదర్శిగా మాట్ల అఖిల్‌, ఉపాధ్యక్షుడిగా మంద రాజు, సంయుక్త కార్యదర్శిగా బోరగాల వెంకటేశ్‌, ప్రచార కార్యదర్శిగా బొడ్డు అరవింద్‌, కోశాధికారిగా బోర్నాల సాగర్‌, సాంస్కృతిక కార్యదర్శిగా బోరగాల సందీప్‌, కార్యవర్గ సభ్యులుగా శివకుమార్‌, కట్కూరి రాకేశ్‌, అజయ్‌కుమార్‌, సుమన్‌, వర్షిత్‌ను ఎన్నుకున్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



చిగురుమామిడి: రెండు నెలలుగా వేతనాలు రావడంలేదని మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో పారిశుధ్య సిబ్బంది, పంపుడ్రైవర్లు సోమవారం జీపీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి నాగరాజును వివరణ కోరగా బదిలీపై పది రోజుల క్రితం వచ్చానని, బ్యాంకు అకౌంట్‌, సంతకం డిజిటల్‌ కావడంలో ఆలస్యమవుతోందని తనవద్ద ఎలాంటి తప్పిదంలేదన్నారు. ధర్నాలో పంపుడ్రైవర్లు పోతుల రమేశ్‌, మాచమల్ల రాజేశం, మాచమల్ల కిరణ్‌, పారిశుద్య కార్మికులు కొంకట మల్లయ్య, బాగ్య, పద్మ, లచ్చవ్వ పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యావ్యవస్థ దేశానికి ఆదర్శం

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: రాష్ట్ర విద్యావ్యవస్థ దేశానికే రోల్‌మోడల్‌ అని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మధురానగర్‌ మైనారిటీ గురుకుల విద్యాలయంలో సోమవారం నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని, విద్యార్థుల బంగారు భవిష్యత్‌ కోసం డైట్‌ చార్జీలను ప్రభుత్వం 40 శాతం పెంచిందన్నారు. మౌలానా అబ్దుల్‌ కలాం ఆజాద్‌ స్ఫూర్తితో తెలంగాణలో మైనారిటీ గురుకుల పాఠశాలలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని, ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తూ నిర్వీర్యమైన విద్యావ్యవస్థను గాడిలో పెడుతున్నారని, గురుకుల విద్యాలయాల్లోని సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని సూచించారు. మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ జాగిరపు రజిత, ప్రిన్సిపాల్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

మండలంలోని మధురానగర్‌లో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను సోమవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులు నిర్వహించే సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించి వివరాలు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



చొప్పదండి: పట్టణ శివారులోని శివకేశవాలయానికి వెళ్లే దారిలో చెత్త పేరుకుపోతోంది. స్థానికుల చెత్తను శ్మశాన వాటిక వద్దే వేస్తుండటంతో భారీగా పోగవుతోంది. దీంతో చెత్తాచెదారం, కాగితాలు, కవర్లు రోడ్డుపైకి కొట్టుకువస్తున్నాయి. దుర్గంధం వ్యాపిస్తోందని రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు, భక్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు శివకేశవాలయం వరకు ఉన్న రోడ్డును పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నాగరాజు, మున్సిపల్‌ కమిషనర్‌, చొప్పదండి సెల్‌ నంబర్‌ 99492 67882

లక్ష్యసాధనకు నిరంతరం కృషిచేయాలి



మాట్లాడుతున్న సీనియర్‌ సివిల్‌ జడ్జి వెంకటేశ్‌

చిగురుమామిడి: విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యసాధనకు నిరంతరం కృషిచేయాలని జిల్లా లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ సీనియర్‌ సివిల్‌ జడ్జి కె. వెంకటేశ్‌ కోరారు. సోమవారం చిగురుమామిడి ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, చిన్నముల్కనూర్‌ ఆదర్శపాఠశాలల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువుకునే వయస్సులో డ్రగ్స్‌, మాదకద్రవ్యాల బారిన పడొద్దని, బడీడు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సైబర్‌ క్రైమ్స్‌ బాగా పెరిగిపోయాయని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకున్నప్పుడే తల్లిదండ్రులు, గురువులకు మంచిపేరు వస్తుందన్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ ఇల్లందుల సంపత్‌కుమార్‌, చిగురుమామిడి ఎస్సై బి. రాజేశ్‌, ఎస్‌ఓ సుజాత, న్యాయవాది మహేశ్‌, విశాలి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిమాన్వితం రామ శబ్దం

కరీంనగర్‌కల్చరల్‌: పవిత్ర పుడమి మీద మానవ రూపంలో నడయాడిన మహిమాన్విత దైవం శ్రీరాముడని, అటువంటి రాముడిని తరచూ మననం చేసుకోవడం పుణ్యకార్యమని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్సియల్‌ ఎడ్యుకేషనల్‌ ఇన్‌స్టిట్యూట్స్‌ సొసైటీ సంయుక్త కార్యదర్శి జీవీ.శ్యాంప్రసాద్‌లాల్‌ అన్నారు. సోమవారం జూమ్‌ వేదికగా జాతీయ సాహిత్య పరిషత్‌ ఆధ్వర్యంలో ప్రారంభమైన కంకంటి పాపరాజు రచించిన ఉత్తర రామాయణ కావ్య గానం, వ్యాఖ్యాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రామాయణం భారతీయ కుటుంబ వ్యవస్థకు బలమైన ఆధారంగా నిలిచి, ప్రపంచ దేశాలకు కూడా మార్గనిర్దేశం చేసిన మహత్యావ్యమైన రామాయణం గురించి ఎన్నిసార్లు తెలుసుకున్నా తనివి తీరదని ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ సాహిత్య పరిషత్‌ అధ్యక్షుడు గాజుల రవీందర్‌ సబ్‌ అధ్యక్షత వహించగా పొన్నం రవిచంద్ర, జంగ మనోహర్‌రెడ్డి, నంది శ్రీనివాస్‌ మాట్లాడారు. కథా రచయిత కటుకోజ్వల మనోహరాచారి ఉత్తర రామాయణ కావ్య గానం చేయగా, ప్రముఖ కవి, అవధాని గంద్ర లక్ష్మణరావు వ్యాఖ్యానం చేశారు. స్తంభంకాడి గంగాధర్‌ సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్‌ బాధ్యులు, సాహితీవేత్తలు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పురస్కారం



ఉత్తమ పురస్కారం అందుకుంటున్న గాజుల అరుణ

జమ్మికుంట: పట్టణానికి చెందిన గాజుల అరుణ హైదరాబాద్‌లో భారత్‌ స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ ఆవిర్భావ దినోత్సం పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ బుర్ర వెంటేశ్‌ చేతుల మీదుగా 2024 ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈసందర్భంగా పట్టణానికి చెందిన పలువురు అరుణకు శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ విద్యా దినోత్సవం

చొప్పదండి: జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని ఆర్నకొండ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మౌలానా అబుల్‌ కలాం ఆజాద్‌ జయంతి నిర్వహించారు. హెచ్‌ఎం రాజమౌళి మాట్లాడుతూ.. మొదటి విద్యాశాఖ మంత్రిగా ఆజాద్‌ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గంగాధర్‌, హరిత, వెంకటేశ్వర్‌రావు, ఉమాదేవి, ప్రార్థన, అనిత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు మార్గదర్శి అబుల్‌ కలాం

తిమ్మాపూర్‌: విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌ కలాం ఆజాద్‌ ఉన్నత విద్యకు మార్గదర్శకుడని మానకొండూర్‌ మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌ పిడిశెట్టి సంపత్‌ అన్నారు. మౌలానా అబుల్‌ కలాం ఆజాద్‌ జయంతి సందర్భంగా పాఠశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ దేశానికి మొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్‌ కలాం ఆజాద్‌ గౌరవార్థం దినోత్సవం జరుపుకుంటామని, మౌలానా అబుల్‌ కలాం ఆజాద్‌ దూరదృష్టి కారణంగానే దేశంలో ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (ఐఐటీ), యూనివర్సిటీ గ్రాంట్‌ కమిషన్‌(యూజీసీ) ఏర్పడి ఉన్నత విద్యకు అత్యున్నతమార్గం ఏర్పడిందని, ఆజాద్‌ దేశంలో ఉన్నత విద్యకు ఊపిరి పోసిన మహనీయుడని పేర్కొన్నారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో క్విజ్‌, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు, పాఠశాల సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్స్‌ కె.అనిత, ఎ.రత్నాకర్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చలో జగిత్యాల

చొప్పదండి: రైతుబంధు, రైతుభరోసా అమలు చేయడంలో కాంగ్రెస్‌ విఫలమైందని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు నిర్వహిస్తున్న జాగో రైతన్న, చలో జగిత్యాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ కోరారు. మంగళవారం మధ్యాహ్నం చేపట్టే పాదయాత్రలో చొప్పదండి నియోజకవర్గం నుంచి రైతులు, బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌, మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారని తెలిపారు.

మానకొండూర్‌లో క్రీడోత్సవం

మానకొండూర్‌: ఈషా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 16,17వ తేదీల్లో మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని మైదానంలో ఈషా గ్రామోత్సవం పేరిట క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని మహిళలకు త్రోబాల్‌, పురుషులకు వాలీబాల్‌ పోటీలు ఉంటాయని ఈషా వలంటీర్లు గూడూరి మమత తెలిపారు. విలేజీ టు విలేజ్‌ క్రీడాకారులే ఇందులో పాల్గొనాలని, ఆసక్తిగల ఉన్నవారు 7095890086 లేదా 9959645828 నంబర్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని కోరారు.

అమరుల స్ఫూర్తితో ఉద్యమిద్దాం

కరీంనగర్‌: విద్యార్థి అమరవీరుల ఆశయాల స్ఫూర్తితో ఉద్యమిద్దామని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్‌ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో జరిగిన విద్యార్థి అమరవీరుల వర్ధంతి సభలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, సమాజంలో అసమానతలు తొలగిపోవాలని, సమసమాజ స్థాపనకు అసువులు బాసిన జాజిరెడ్డి, జంపాల చంద్రశేఖర్‌, శ్రీపాద శ్రీహరి, చేరాలు రంగవల్లి చాంద్‌ పాషా లాంటి విద్యార్థి నాయకులు ఎందరో అమరులయ్యారన్నారు. పెండింగ్‌ స్కాలర్‌షిప్‌, ఫీజురీయింబర్స్‌మెంట్‌వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. శ్రీమాన్‌, జగన్‌, రంజిత్‌, సురేశ్‌, నవీన్‌ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగంపై సర్కారు చిన్నచూపు

చొప్పదండి: విద్యార్థుల పట్ల వివక్షత చూపుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా పెండింగ్‌ స్కాలర్‌షిప్‌ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ విడుదల చేయకుండా విద్యారంగాన్ని రాష్ట్ర సర్కార్‌ చిన్నచూపు చూస్తోందని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్‌ విమర్శించారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యార్థులు ఆర్థిక పరమైన అవస్థలు ఎదుర్కొంటున్నారని, బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పెండింగ్‌ బకాయిలపై పదే పదే మాట్లాడిన కాంగ్రెస్‌ నేతలు ఇప్పుడు అదే బాటలో పయనిస్తున్నారని విమర్శించారు. తక్షణమే స్పందించి పేద విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. జీతీయ నూతన విద్యా విధానం ఉపసంహరించుకోవాలని కోరారు.

ఖురాన్‌ బోధనలు అనుసరించాలి

హుజూరాబాద్‌రూరల్‌: ప్రతి ముస్లిం పవిత్ర ఖురాన్‌ బోధనలను అనుసరించాలని ముఫ్తి ఫయాజ్‌ మొయుద్దీన్‌ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని మదర్సాలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. మొబైల్స్‌తో యువత పెడదారి పడుతున్నారని, మొబైల్‌ మంచి పనులకే వాడాలని కోరారు. మదర్సాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఖురాన్‌ కంఠస్థం పూర్తి చేయడం సంతోషకరమన్నారు. మదర్సా ప్రిన్సిపల్‌ షేక్‌ నయీమ్‌, పట్టణజామ మసీద్‌ అధ్యక్షుడు మహమ్మద్‌ ముజాహిద్‌ హుస్సేన్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌ గ్రామంలో సోమవారం బైక్‌ను కారు ఢీ కొనడంతో ఒకరి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు...చింతలపల్లి గ్రామానికి చెందిన మెనిగంటి ఐలయ్య(55) కేశవపట్నం నుంచి బైక్‌పై స్వగ్రామం వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన ఐలయ్యను 108లో హుజూరాబాద్‌ ఆస్పత్రికి తరలించారు.

వరిపొలం దగ్ధం



శంకరపట్నం: మండలంలోని రాజాపూర్‌ గ్రామంలో సోమవారం చింతిరెడ్డి మల్లారెడ్డి వరిపొలం పాక్షికంగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన చింతిరెడ్డి మల్లారెడ్డి పదెకరాల్లో వరిసాగు చేశాడు. పక్కన పొలం ఇటీవల హార్వెస్టర్‌తో కోయగా వరికొయ్యలకు గుర్తు తెలియని వ్యక్తి నిప్పు అంటించాడు. దీంతో మంటలు మల్లారెడ్డి పొలంలోకి వ్యాపించడంతో నీరు పెట్టి మంటలు ఆర్పివేయడంతో కొంతమేర వరిపంట కాలిపోయింది. వరికొయ్యలకు నిప్పుపెట్టి, పంట నష్టానికి కారణమైన వ్యక్తిపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.

భవిష్యత్‌ తరాలకు విద్యుత్‌ శక్తే ఆధారం



మాట్లాడుతున్న వొడితెల సతీశ్‌కుమార్‌

హుజూరాబాద్‌రూరల్‌: దైనందిన జీవితంలో విద్యుత్‌ శక్తి పాత్ర కీలకమైందని, పారిశ్రామిక అభివృద్ధిలో ప్రధాన భూమిక వహిస్తుందని హుస్నాబాద్‌ మాజీ ఎమ్మెల్యే, కిట్స్‌ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్‌ వొడితెల సతీశ్‌కుమార్‌ అన్నారు. సోమవారం కాలేజీ డైరెక్టర్‌ డాక్టర్‌ కందుకూరి శంకర్‌ అధ్యక్షతన కళాశాలలో ఏఐసీటీఈ ప్రాయోజిత అటల్‌ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రాం నిర్వహించారు. విద్యా సంస్థలు, పారిశ్రామిక సంస్థల మధ్య అనుసంధానానికి నిపుణులైన ఇంజినీర్ల కోసం కేంద్ర ప్రభుత్వం ఏఐసీటీఈ ఆల్‌ ఇండియా కౌన్సిల్‌ ఫర్‌ టెక్నికల్‌ ఎడ్యుకేషన్‌ అటల్‌ ఫ్యాకల్టీ డెవలప్మెంట్‌ ప్రోగ్రాం నిర్వహిస్తుందన్నారు. సౌర, పవన విద్యుత్‌ మొదలగునవి విరివిగా వినియోగించాల్సివస్తుందని, వీటి కోసం ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. అధ్యాపకులు సాంకేతిక విజ్ఞానం నేర్పించడం ద్వారా ఉద్యోగాలు పొందుతారని, డీజిల్‌, పెట్రోల్‌తో వాహనాల సంఖ్య తగ్గి విద్యుత్‌ వాహనాలు అందుబాటులోకి వస్తాయని, ఎలక్ట్రిక్‌ చార్జింగ్‌ స్టేషన్లు ఏర్పాటవుతాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన రిట్రన్‌ టెక్నాలజీస్‌ డైరెక్టర్‌ ఎస్‌.రామచందర్‌, ఈవీ ట్రానిక్స్‌ ఇంజినీర్‌ బి.దీపక్‌కుమార్‌ శిక్షణ ఇచ్చారు. ప్రారంభ సమావేశంలో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.ఈశ్వరయ్య, సమన్వయకర్త ఈఈఈ విభాగ అధిపతి డాక్టర్‌ యోగేశ్‌ పుండలిక్‌, సహసమన్వయకర్త డాక్టర్‌ ఏ. కొమురయ్య, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.